క్లుప్తంగా

నేడు అర్ధవీడు మండల సమావేశం

అర్ధవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నేడు శుక్రవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ మేడూరి వెంకటరావు అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో నర్సయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరు కావాలని, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అనారోగ్యంతో మాజీ సైనికుడు మృతి



ఎస్ సాయిలు (ఫైల్)

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు సగినాల సాయిలు (65) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో సోమవారం మృతి చెందారు. భార్య సగినాల రాయలమ్మ రాచర్ల పంచాయతీ సర్పంచ్‌గా ఉండగా, ఆయన ముగ్గురు కుమారులు కూడా ఇండియన్ ఆర్మీలో వీధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం సగినాల సాయిలు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న నారాయణరెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో ఆయన భౌతిక దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకుడు బీఎస్.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అనాథ శవానికి అంత్యక్రియలు చేయడం బాధ్యతగా భావించాలన్నారు. జీవించినంత కాలం ఎన్నో కష్టాలు పడి చివరి దశలో ప్రాణాలున వదిలిన వ్యక్తులను గౌరవంగా అంత్యక్రియలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అన్వేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్ఎం పద్మజ

కొమరోలు: మండలంలోని అల్లినగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని హిందీ ఉపాధ్యాయుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య గురువారం పంపిణీ చేశారు. హిందీ కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు పాఠశాల హెచ్ఎం పద్మజకు గురువారం అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జులై 9న ఆశావర్కర్ల సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మీ

గిద్దలూరు రూరల్: దేశవ్యాప్తంగా జులై 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మీ అన్నారు. పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో గురువారం నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి ఆచరణలో పెట్టడం లేదన్నారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయినా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రంగాల్లో పనిచేస్తున్న స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఐక్యమంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, థామస్, నూర్జహాన్, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరు రూరల్: మండలంలోని కేఎస్ పల్లె, కంచిపల్లె, కే బయనపల్లె గ్రామాల్లోనూ, పట్టణం పరిధిలోని వ్యవసాయ బోర్ల పరిధిల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ బి.శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా అంతరాయం ఉంటుందని, కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

మేమేం చేశాం పాపం..
కౌలు రైతవడమే శాపం !

- కౌలు రైతులకు సుఖీభవ లేనట్లేనా ?
- కౌలు రైతులను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో 7 వేల మందికి పైనే కౌలు రైతులు
- ఐదేళ్లపాటు రైతు భరోసా ఇచ్చిన నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



బేస్తవారిపేట గ్రామ సచివాలయం

మండలం	టార్గెట్	మంజూరు చేసిన కార్డులు
కంభం	1171	27
అర్ధవీడు	895	150
బేస్తవారిపేట	1261	74
రాచర్ల	1082	108
కొమరోలు	1074	126
గిద్దలూరు	1534	260

బేస్తవారిపేట: గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో వ్యవసాయం స్వర్ణయుగాన్ని చూస్తే నేడు కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే నరకయుగాన్ని చూపించింది. విత్తినప్పటి నుంచి పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు పంటను రోడ్డు మీద పారబోశారు. పంట ఉత్పత్తులను కొనేనాథుడు లేకపోవడంతో రైతన్నలు అప్పులపాలయ్యారు. మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఖరీఫ్, రబీ సీజన్‌లకు ముందే రైతుభరోసా అందించి సాయం అందించాడు. భూ యజమానులకే కాక కౌలు రైతులకు కూడా భరోసా అందించి నేనున్నాని ధైర్యం చెప్పాడు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం విషయంలో కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపుతోంది. పెట్టుబడి సాయాన్ని కొందరి రైతులకే అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది ఈ పథకాన్ని విస్మరించింది. రెండో సంవత్సరంలోనూ రైతులకే అందించేలా చర్యలు చేపడుతున్నప్పటికి ఇందులో కౌలు రైతుల ప్రసావనే లేదు.

నాడు భరోసా..!

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులతో సమానంగానే కౌలు రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించింది. కేంద్రమిచ్చే రూ.6 వేలతో రూ.7,500ను కలిపి రూ.13,500 మొత్తాన్ని రైతు భరోసా రూపంలో అందించింది. కౌలు రైతులకు నిధులను కేంద్ర ప్రభుత్వమివ్వక పోవడంతో దీన్ని రాష్ట్ర ప్రభుత్వమే అందజేసింది.

హామీ నీటిమూటేనా.. ?

గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు హామీలతో ఊదరగొట్టాయి. తాము అధికారంలోకి వచ్చాక కేంద్ర ప్రభుత్వ వాటా రూ.6 వేలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.14 వేలను కలిపి రూ.20 వేలను రైతులతో పాటు కౌలు రైతులకూ అందిస్తామని హామీ ఇచ్చింది. సీసీఆర్ కార్డులు చేయించుకోండి. నగదును జమ చేస్తామని చెప్పడంతో కౌలు రైతులంతా వీటిని పొందారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలను ఈ ఏడాది అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో అర్హుల జాబితాలను ప్రచురించింది. వీరందరూ ఈ-కేవైసీని చేయించుకోవాలని సూచించింది.

నియోజకవర్గంలో 7 వేల మంది కౌలు రైతులు

గిద్దలూరు నియోజకవర్గంలో 7 వేల మంది కౌలు రైతులున్నారు. వీరందరూ గత ప్రభుత్వహయాంలో పెట్టుబడి సాయం కింద నగదు పొందారు. అయితే ప్రస్తుతం కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడంతో పాటు సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్ నేటికీ అందుబాటులోకి రాలేదు. దీంతో కౌలు రైతులకు ప్రభుత్వం మొండి చేయి చూపనుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

> **ఎటువంటి సమాచారం లేదు..**
> అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు అర్హుల జాబితాను ప్రభుత్వం సిద్ధం చేసింది. కౌలు రైతులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. సీసీఆర్ కార్డులకు సంబంధించిన వెబ్‌సైట్ అందుబాటులోకి రాలేదు. ఈ విషయంలో స్పష్టత లేదు.
> – షేక్ అబ్దుల్ రఫీక్, ఏఓ, బేస్తవారిపేట

డాక్టర్ బాలయ్య సేవలు అభినందనీయం



డాక్టర్ బాలయ్యను సన్మానిస్తున్న వైద్య బృందం

కొనకనమిట్ల: ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వ వైద్యశాల డాక్టర్‌గా పని చేసి బదిలీపై వెళుతున్న స్థానిక ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ఎస్పీ బాలయ్య సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కొనకనమిట్ల ప్రాథమిక వైద్యశాలలో గత కొన్నేళ్లుగా ప్రభుత్వ వైద్యులుగా పని చేసి అందరి మన్ననలు పొందిన బాలయ్య బదిలీపై గొట్లగట్టు ప్రభుత్వ వైద్యశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక వైద్యశాలలో డాక్టర్ సురేఖ ఆధ్వర్యంలో వైద్య బృందం, సిబ్బంది బాలయ్యను సత్కరించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, నాయకులు యక్కంటి తురుపతిరెడ్డి, కల్లం దిబ్బారెడ్డి, సూరవరపు పెదవెంకటరెడ్డి, పలు వైద్యశాలల డాక్టర్లు ఆశోక్‌రెడ్డి, నరేంద్రకుమార్, పనీశ్వర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక

అర్ధవీడు: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇద్దరి విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పీ. కోటేశ్వరావుకు నూజివీడులో, బీ. నరేష్‌కు ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు ఆయన తెలిపారు.

మాదక ద్రవ్యాలు వాడితే జీవితాలు నాశనం



బేస్తవారిపేటలో మాట్లాడుతున్న లీగల్ ప్యానల్ న్యాయవాది పోలయ్య



మార్కాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది



గిద్దలూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ

- అంతర్జాతీయ మాదకద్రవ్య నిరోధక దినం
- ర్యాలీలు నిర్వహించిన పోలీసులు, విద్యార్థులు

మార్కాపురం: విద్యార్థులు, ప్రజలు ఎవరైనా మాదకద్రవ్యాలు వాడితే తీవ్ర అనారోగ్యానికి గురవుతారని.. తర్వాత వారి జీవితాలు నాశనం అవుతాయని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటరెడ్డి, మార్కాపురం ట్రాఫిక్ ఎస్సై అహరోన్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య నిరోదక దినం సందర్భంగా పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు మానసిక ఒత్తిడి, సమస్యల వలన డ్రగ్స్ వాడుతున్నారని, వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. డ్రగ్స్ వాడటం వలన రోగనిరోధక వ్యవస్థ, జీర్ణవ్యవస్థ పాడవుతుందన్నారు. డ్రగ్స్ అమ్మినా, కొన్నా కేసులు నమోదుచేస్తామన్నారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడిన యువతకు ఉద్యోగాలు రావన్నారు. ర్యాలీలో ఎక్సైజ్ ఎస్సై గోపాలకృష్ణ, పట్టణ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన..

కంభం: డ్రగ్స్ వాడకాన్ని నివారించడంలో కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం కలిసికట్టుగా ముందడుగు వేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గౌతమ్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా పట్టణంలోని సాయిచైతన్య జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

బేస్తవారిపేట: గిద్దలూరు మండల లీగల్ ప్యానల్ న్యాయవాది చల్లగాలి పోలయ్య ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, పోక్సో చట్టం, ఈవ్‌టీజింగ్, లైంగిక నేరాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం మన్నెం శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించాలి



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా సాధన కమిటీ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురాన్ని జిల్లాగా తక్షణమే ప్రకటించాలని మార్కాపురం జిల్లా సాధకుల వేదిక నాయకులు గోపాలుని హరిహరరావు, పీఎల్పీ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం మార్కాపురాన్ని జిల్లాగా వెంటనే ప్రకటించాలని కోరుతూ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా శ్రీశైలం, సున్నిపెంట తదితర ప్రాంతాల నుంచి సుమారు 150 కిలోమీటర్లు దూరం ఉందన్నారు. శ్రీశైలం మార్కాపురం డివిజన్ కేంద్రానికి 80 కిలోమీటర్ల దూరం ఉన్నందున మార్కాపురం జిల్లాలో కలపాల్సిన పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయన్నారు. అలాగే 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న వినుకొండను మార్కాపురం జిల్లా కేంద్రంలో కలపాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా జిల్లా ప్రకటించాలని కోరారు. జిల్లా సాధకుల వేదిక నాయకులు రంగస్వామిగౌడ్, అబ్రహాం రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు యాదవ్, నాగార్జున ప్రసాద్ యాదవ్, చెంచయ్య, చక్రపాణి యాదవ్, నాగార్జునగౌడ్, వెంకటేష్ రమణ తదితరులు పాల్గొన్నారు.

వారాహి అలంకారంలో అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలోని జగదాంబ అమ్మవారికి వారాహి నవరాత్రులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆంజనేయశర్మ, వరుణ్‌తేజ, అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు అమ్మవారిని ఉన్మత్త వారాహి అలంకారంలో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.



అలంకారంలో జగదాంబ అమ్మవారు

కన్నుల పండువగా పోలేరమ్మ తిరునాళ్లు

బేస్తవారిపేట: మండలంలోని జెన్నివారిపల్లెలో గురువారం పోలేరమ్మ తిరునాళ్ల కన్నుల పండువగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన కుంకుమ బండ్లతో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు తరలివెళ్లారు. మహిళలు బోనాలతో ఆలయం వద్దకు వెళ్లి తమ మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.



కుంకుమబండ్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్తులు

సమావేశంలో సమస్యలకు పరిష్కారం దక్కేనా ?



కంభం పంచాయతీలో గృహాల మధ్య ఇరిగేషన్ కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

- నేడు మండల సర్వసభ్య సమావేశం

కంభం: మూడు నెలలకొక సారి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చే సమస్యలను నమోదు చేసుకునే అధికారులు వాటిని పరిష్కరించడంలో జాప్యం వహిస్తుండటంతో సమస్యలు పరిష్కారం కాక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గత సమావేశంలో చెప్పిన సమస్యలు పరిష్కారం కాకుండా మరో సమావేశం జరిగి పోతుంది తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ప్రతి నెలలో ఒక శనివారం పారిశుద్ధ్యంపై నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లు ఫొటోలకే పరిమితమవుతున్నాయి. కంభం పంచాయతీ పరిధిలోని అర్బన్ కాలనీలో పలువీధుల్లో సిమెంటు రోడ్లు వేసినప్పటికి డ్రైనేజి వ్యవస్థ లేక పోవడంతో మురుగునీరు ఇండ్ల ముందే నిలిచిపోతుంది. పైప్ లైన్లు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో నీటి సమస్య తలెత్తుందని లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని పంచాయతీ అధికారులు నామమాత్రంగా మరమ్మతులు చేస్తుండటంతో మురుగునీరు వస్తున్నాయని స్థానికులు చెప్తున్నారు.

వేధిస్తున్న కుక్కల బెడద..

మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో కుక్కల బెడద అధికంగా ఉంది. రోజుకు నాలుగైదు మంది కుక్కకాటుకు గురై ప్రభుత్వ వైద్యశాలకు పరుగులు తీస్తున్నారు. కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల పందులు సైతం స్వైరవిహారం చేస్తున్నాయి. పట్టణంలో చాలా కాలం నుంచి లోఓల్టేజి సమస్య వేధిస్తోంది. విద్యుత్ వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా విద్యుత్ శాఖాధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయక పోవడం, సమస్య ఉన్న ప్రాంతాల్లో నూతన స్తంబాలు వేసి లైన్లు మరమ్మతు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

> **కాలనీలో సమస్యలు పరిష్కరించాలి..**
> 
> అర్బన్ కాలనీలో సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పరిష్కారం కావడం లేదు. అధికారులు కాలనీ సమస్యల పై దృష్టి సారించాలి. కందులాపురం కూడలీలో రోడ్డులు ఇవ్వకుండా రుసుం వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.
> – అన్వర్‌బాషా, సీపీఎం నాయకుడు, కంభం

సాహు మహారాజ్ జయంతి వేడుకలు



సాహు మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

గిద్దలూరు రూరల్: ఛత్రపతి సాహు మహారాజ్ 151వ జయంతి వేడుకలను పట్టణంలోని సాయి టెక్నో ఒకేషనల్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ నాయకుడు కంచర్ల కోటయ్యగౌడ్ మాట్లాడుతూ కొల్హాపూర్‌లో మరాఠాల బోంసలే రాజవంశానికి చెందిన యాదవరాజు సాహు మహారాజ్ ఆయన ఆస్థానంలో 1900–1922 మధ్యకాలంలో బడుగు బలహీన వర్గాల కోసం రిజర్వేషన్లు ప్రవేశపెట్టాడన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా విద్యార్థులు ఆయన జీవిత చరిత్ర గురించి తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ రాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సాయి అఖండ పారాయణం

మార్కాపురం: గురుపౌర్ణమి పర్వదినాలను పురస్కరించుకుని పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా ఆలయంలో జూన్ 26 నుంచి జూలై 2వ తేదీ వరకూ సాయి బాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం నిర్వహిస్తారని మందిరం కార్యదర్శులు గోపాలుని హరిహరరావు తెలిపారు. వారంరోజుల పాటు సుమారు 600 మంది సాయి భక్తులచే 24 గంటల పాటు బాబా జీవిత చరిత్ర పారాయణం ఉంటుందని, గురుపౌర్ణమి పర్వదినాల్లో బాబా జీవిత చరిత్ర పారాయణం చేస్తే బాబా ఆశీస్సులు పొందుతారన్నారు.